సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 13 । జూన్ । 2025



సర్కారు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అందుబాటులోకి రానుంది. ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 12 జిల్లాలను ఇందుకు ఎంపిక చేశారు. 8లో▸



సమస్యల పరిష్కారానికే సదస్సులు

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బేల మండలం దహెగాంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/27.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రొసీడింగ్స్ అందజేత



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇస్తున్న నవీన్‌కుమార్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ ప్రారంభమైంది. వార్డుల వారీగా ప్రత్యేకాధికారులను నియమించి వీటిని అందజేస్తున్నారు. 45వ వార్డు భుక్తాపూర్‌లో 10మందికి ఇళ్లు మంజూరు కాగా, ఒకరు ఆసక్తి చూపకపోవడంతో గురువారం తొమ్మిది మందికి స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ బండారి సతీశ్ పత్రాలు అందజేశారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. వార్డు ఆఫీసర్ ప్రశాంత్, ఆర్పీ రాధ, రాహుల్, జీవిత తదితరులున్నారు. 37వ వార్డు ఓల్డ్ హౌసింగ్ బోర్డు, రవీంద్రనగర్ కాలనీల్లోనూ స్పెషలాఫీసర్ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్ జ్యోతి, మాజీ కౌన్సిలర్ అంబకంటి అశోక్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పత్రాలు అందజేశారు.

'సర్కారు'లోనే నాణ్యమైన విద్య



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

సాత్నాల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం మాంగుర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు బోధిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. డ్రాపౌట్స్ లేకుండా బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీ (బంగారుగూడ)లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయోలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. బీఎడ్, పీజీ విద్యార్హతలు కలిగి ఉండాలని, మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు రూరల్ కేజీబీవీలో సంప్రదించాలని సూచించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు..

2025–26 సంవత్సరానికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు www.scholarships.gov.in ను సంప్రదించాలని సూచించారు.

సెర్ప్ సీఈవో చొరవతో చిరుద్యోగికి ఆర్థికసాయం



చెక్కు ఇస్తున్న రవీందర్, పూర్ణచందర్

కైలాస్‌నగర్: సెర్ప్ సీఈవో, పాత కలెక్టర్ దివ్య దేవరాజన్ చొరవతో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ చిరుద్యోగికి ఆర్థిక చేయూత అందింది. గతేడాది డిసెంబర్ 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో బోథ్ మండల సమాఖ్య కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే బొల్లారం అశోక్ తల పగలడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఇందుకు రూ.7.50లక్షల వరకు ఖర్చు కాగా, బాధితుడు అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితికి చలించిన డీఆర్డీవో రాథోడ్ రవీందర్ బాధితుడిని ఆదుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌కు లేఖ రాశారు. అందుకు ఆమె స్పందిస్తూ బాధితుడిని ఆదుకోవాలంటూ స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డిని కోరారు. సీఈవో విజ్ఞప్తికి స్పందిస్తూ ప్రభుత్వపరంగా రూ.3లక్షల ఆర్థికసాయాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో డీఆర్డీవో చేతుల మీదుగా ఆ చెక్కును అశోక్–జ్యోతి దంపతులకు అందజేశారు. అధికారుల చొరవకు వారు కృతజ్ఞతలు తెలిపారు. స్త్రీనిధి రీజినల్ మేనేజర్ వీ పూర్ణచందర్, హెచ్‌ఆర్ శ్రీనివాస్, ఏపీడీ గోవింద్‌రావు తదితరులున్నారు.

బతుకులు ఛిద్రం



రంభాబాయి మృతదేహం

- పిడుగుపాటుకు ఆరుగురు మృతి
- భర్త, కూతురిని కోల్పోయిన మహిళ
- తల్లులకు దూరమైన కొడుకు, బిడ్డ
- గాదిగూడ, బేల మండలాల్లో ఘటనలు
- చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- విత్తనాలు వేస్తుండగా దుర్ఘటన



మాధవ్‌రావు (ఫైల్)



సుజాత (సంజన) (ఫైల్)



రంభాబాయి (ఫైల్)



భీంబాయి (ఫైల్)



సునీత (ఫైల్)



నందిని (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్/నార్నూర్/బేల: వారంతా మట్టి మనుషులు.. మట్టినే నమ్ముకుని జీవించేవారు.. ఆ మనుషుల మధ్య ఉన్న ఆత్మీయత ఎంతచెప్పినా తక్కువే.. భార్యాభర్తలిద్దరు పిల్లలతో కలిసి తమ చేనులో విత్తనాలు వేస్తున్నారు. విత్తనాలు వేసే మిగతావారు కూడా ఈ కుటుంబానికి దగ్గరి సంబంధీకులే. అంతా ఆదివాసీ గిరిజనులే. వీరంతా హుషారుగా విత్తనాలు వేశారు. మధ్యాహ్నం కావడంతో 14 మంది ఒకే దగ్గర భోజనం చేశారు. ఆ తర్వాత మళ్లీ విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇంతలో వర్షం రావడంతో అంతా వెళ్లి సమీపంలోని చిన్న గుడిసెలో ఒకే దగ్గర కూర్చున్నారు. సరిగ్గా అదే సమయానికి పక్కనున్న టేకు చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. ఉలిక్కిపడేలోపే గుడిసెలోని నలుగురు ప్రాణాలు విడిచారు. ఆ మట్టిపైనే నేలకొరిగారు. మిగతా వారు చెల్లాచెదురుగా పడిపోయి గాయాలతో బయటపడ్డారు. ఇది గాదిగూడ మండలంలోని పిప్పిరి గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘటన. జిల్లాలో మరో రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. ఈ ఘటనల్లో బేల మండలంలోని ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. మొత్తంగా పిడుగుపాటుకు ఆరుగురు మృత్యువాత పడిన ఘటనలు జిల్లాలో తీవ్ర విషాదాన్ని కలిగించాయి.

బాధిత కుటుంబాల్లో విషాదం..

గాదిగూడ మండలం పిప్పిరికి చెందిన పెందూర్ మాధవరావు తన చేనులో భార్య, కుమారులు, కూతురుతో పాటు దగ్గరి సంబంధీకులైన 14 మందితో కలిసి గురువారం మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. పిడుగుపాటుకు గురై మాధవరావు, ఆయన కూతురు పెందూర్ సంజన అలియాస్ సుజాత, సంబంధీకులు సిడం రంభాబాయి, మంగం భీమ్‌బాయి మృతిచెందారు. ఈ ఘటనలో మాధవరావు భార్య పెందూర్ రేణుక, ఇద్దరు కుమారులు పెందూర్ జంగు, పెందూర్ శేఖు గాయపడ్డారు. సిడం రాంబాయి కుమారుడు సిడం శంకర్, మంగం భీమ్‌బాయి కూతురు మంగం నందిని కూడా గాయాలపాలయ్యారు. వీరితో పాటు దగ్గరి సంబంధీకులైన హెచ్‌కే ఈశ్వర్, మర్సుకోల అంజలి, మర్సుకోల సోము, గెడం శంభు, గుణవంత్‌రావు కూడా గాయపడ్డారు. ఇక బేల మండలంలోని సాంగిడి, సోన్‌కాస్ గ్రామాల్లో పత్తి విత్తనాలు వేస్తుండగా పిడుగుపాటుకు మహిళా కూలీలు గెడం నందిని, కోవ సునీత మృతిచెందారు. వీరిరువురికి భర్త, పిల్లలున్నారు. కాగా, క్షతగాత్రులను చికిత్స కోసం సమీప ఆస్పత్రికి తరలించారు. కొందరిని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిని పలువురు పరామర్శించారు.

పిడుగుపడి కుమ్మరితండాలో ముగ్గురికి గాయాలు



గాయపడ్డ ధర్మరాజు, కృష్ణబాయి, నిర్మల

ఉట్నూర్‌రూరల్: మండలంలో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడగా మండలంలోని కుమ్మరితండాకు చెందిన ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరితండాకు చెందిన ధర్మరాజు, కృష్ణబాయి, నిర్మల గురువారం చేను పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. పంటచేనులోని పశువులపాక సమీపాన ఉన్న చెట్టుపై పిడుగు పడగా అక్కడే ఉన్న ముగ్గురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు.

మృతుల వివరాలు

పిడుగు పడిన ఘటనలో గాదిగూడ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన తండ్రి, కూతురు పెందూర్ మాధవ్‌రావు (45), సుజాత అలియాస్ సంజన (16), మాధవ్‌రావుకు దగ్గరి సంబంధీకులైన సిడం రంభాబాయి (40), మంగం భీమ్‌బాయి (45) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే బేల మండలం సాంగిడి గ్రామంలో పిడుగుపాటుకు గురై గెడం నందిని (30), సోన్‌కాస్ గ్రామంలో కోవ సునీత (40) ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా రెండు వేర్వేరు ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా, ఇందులో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడున్నారు.

మోగిన బడిగంట



జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నంబర్‑1లో విద్యార్థులకు పూలు, బెలూన్లు, చాక్లెట్లు ఇచ్చి స్వాగతిస్తున్న టీచర్లు

- పూలు ఇస్తూ.. బొట్టు పెడుతూ.. విద్యార్థులకు గురువుల స్వాగతం
- మొదటిరోజు హాజరు అంతంతే
- సందడిగా మారిన పాఠశాలలు



తరగతి గదిలోనికి వెళ్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: బడి గంట మోగింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇన్నిరోజుల పాటు వేసవి సెలవుల్లో ఆటాపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం బడుల వైపు అడుగులు వేశారు. తొలిరోజు బడికి వెళ్లేందుకు చాలామంది చిన్నారులు మొగ్గుచూపలేదు. తల్లిదండ్రులు వారిని బలవంతంగా బడులకు తీసుకువెళ్లాల్సి వచ్చింది. సర్కారు బడులతోపాటు ప్రైవేట్ పాఠశాలలనూ అలంకరించి విద్యార్థులను ఆకర్షించేలా ముస్తాబు చేశారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు గేటు వద్ద పూలు అందించి విద్యార్థులకు స్వాగతం పలికారు. దీంతో సంతోషంగా వారు తరగతి గదుల్లోకి అడుగిడారు. మొదటిరోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువగా కనిపించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో పంపిణీ జరగలేదు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినప్పటికీ యూనిఫాంలు కొందరికే ఇచ్చారు. యూనిఫాంలు కుట్టడం పూర్తయిన తర్వాత అందరికీ అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, సమస్యలుంటే పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా, జిల్లాలో 14 పాఠశాలలు మూతపడగా, జిల్లా కేంద్రంలోని వెంకట్‌రావుకాలనీలో ప్రాథమిక పాఠశాలను 12 ఏళ్ల తర్వాత పునఃప్రారంభించారు. కాలనీలోని విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలకు తీసుకువచ్చారు. దాదాపు 25 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరికి పుస్తకాలు పంపిణీ చేశారు.

బొట్టు పెట్టి విద్యార్థులకు స్వాగతం



కప్పర్లలో బొట్టుపెట్టి స్వాగతిస్తూ..

తాంసి: మండలంలోని కప్పర్ల జెడ్పీ హైస్కూల్, నిపాని, బండల్‌నాగాపూర్, జామిడి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రవేశాలు పొందారు. మొదటిరోజు పాఠశాలకు వచ్చిన వీరందరికీ ఉపాధ్యాయులు బొట్టు పెట్టి స్వాగతం పలికారు. ఈ విద్యాసంవత్సరంలో కప్పర్ల పాఠశాలలో 53 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు హెచ్‌ఎం ఆనంద్ తెలిపారు.

విద్యార్థులకు పూలతో స్వాగతం



నార్నూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పూలిచ్చి స్వాగతిస్తున్న ఎంఈవో, టీచర్లు

నార్నూర్: తొలిరోజు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల తె/మీ పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఎంఈవో పవార్ అనిత, ఉపాధ్యాయులు పూలిచ్చి స్వాగతం పలికారు. ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు నిర్మల, జ్ఞానేశ్వర్, లక్ష్మణ్, ఈశ్వర్ చౌహాన్ ఉన్నారు.

పిడుగుల నుంచి రక్షణ ఇలా..

కైలాస్‌నగర్: జిల్లాలో గురువారం కురిసిన భారీ వర్షానికి సంభవించిన పిడుగుపాటుకు ఏకంగా ఆరుగురు మృత్యువాతపడ్డారు. అయితే.. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పిడుగుపాటుకు గురి కాకుండా ప్రాణాలు కాపాడుకోవచ్చని కలెక్టర్ రాజర్షి షా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కారుమబ్బులు కమ్ముకుని.. భారీ శబ్దాలతో కూడిన ఉరుములు.. కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులు వస్తున్నాయంటే పిడుగులు పడతాయని గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సమయంలో బయట తిరగవద్దని తెలిపారు. లోహపు వస్తువులను చేతిలో ఉంచుకోవద్దని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని పేర్కొన్నారు. పిడుగులు చెట్లపై లేదా విద్యుత్ స్తంభాల వద్ద పడే అవకాశమున్నందున వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు నదులు, వాగులు, చెరువుల్లో స్నానం చేయడం మంచిది కాదని తెలిపారు. భూమి మీద అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్ల మీద కూర్చోవాలని పేర్కొన్నారు. మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చుంటే పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం తక్కువగా ఉంటుందని తెలిపారు. ల్యాండ్ ఫోన్ వినియోగించవద్దని పేర్కొన్నారు. ఇంట్లో ఉన్నప్పుడే సెల్‌ఫోన్ వినియోగించాలని సూచించారు. ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డ్ నుంచి అన్ని కనెక్షన్లు తీసివేయాలని, షవర్ కింద స్నానం చేయొద్దని, చేతులు, గిన్నెలు కడగవద్దని తెలిపారు. ఇంటి తలుపులు, కిటికీల వద్ద నిలబడవద్దని, వాటిని మూసి ఉంచాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'జూపల్లి'

- మంత్రి వివేక్‌కు మెదక్ జిల్లా బాధ్యతలు
- నిజామాబాద్‌కు మంత్రి సీతక్క



జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన ధనసరి అనసూయ సీతక్కకు నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఆదివాసీల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్‌కు సీతక్కను ఇన్‌చార్జిగా నియమించారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఆమె ఉత్సాహంగానే పనిచేశారు. జిల్లా అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో నిరాశకు గురైన ఆమె నాటి నుంచి జిల్లాపై అంతగా ఆసక్తి చూపలేదు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించడం దాదాపుగా తగ్గించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగేందుకు కూడా ఆసక్తి చూపలేదు. ఈ విషయాన్ని కొన్ని సందర్భాల్లో సీతక్క బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల మార్పు జరిగితే సీతక్క జిల్లా బాధ్యతల నుంచి తప్పుకుంటారనే చర్చ గత కొంతకాలంగా సాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన ఇన్‌చార్జి మంత్రుల జాబితాతో ఆ విషయం స్పష్టమైంది. కొత్తగా రానున్న జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ఎలాంటి ప్రభావం చూపనున్నారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జూపల్లి సీనియర్ మంత్రి కావడంతో జిల్లాకు మేలు జరిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. కాగా, ఇటీవల కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్‌వెంకటస్వామికి మెదక్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఆర్వోబీ ఆలస్యం

- పూర్తి దశలో ఒకవైపు పనులు
- రెండోవైపు చేపట్టని నిర్మాణం
- అందని భూసేకరణ నిధులు
- అతీగతీ లేని రైల్వే అండర్ బ్రిడ్జి

ఆర్వోబీ వివరాలు ఇలా..

అంచనా వ్యయం	రూ.56.31కోట్లు
నిర్మాణం పొడవు	931.825 మీటర్లు
కలెక్టర్‌చౌక్ వైపు	220.512 మీటర్లు
మార్కెట్‌యార్డు వైపు	711.313 మీటర్లు
రైల్వేట్రాక్ భాగం	37.280 మీటర్లు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద చేపట్టాల్సిన బ్రిడ్జీల నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి.. అన్నచందంగా సాగుతున్నాయి. ఆర్డీవో కార్యాలయం వద్ద గతేడాది చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం ఓ వైపు పూర్తి కావస్తుండగా.. మరోవైపు పనులు ప్రారంభించలేదు. ఇక తాంసి బస్టాండ్ ప్రాంతంలో నిర్మించాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనులకు మోక్షమే కలగలేదు. భూసేకరణకు నిధుల రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదలలో జాప్యంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది.

ఓ వైపు వేగంగా ఆర్వోబీ పనులు

స్పిన్నింగ్ మిల్ గేట్ రైల్వే క్రాసింగ్ (ఎల్‌సీ గేట్ 29) వద్ద రూ.56.31 కోట్లతో చేపట్టిన ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.27.63 కోట్లతో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గతేడాది జనవరిలో పనులు ప్రారంభించారు. భూసేకరణ సమస్య లేని మార్కెట్‌యార్డు వైపు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 30 పిల్లర్లు నిర్మించి వాటిపై స్లాబ్ పనులు పూర్తి చేశారు. రూ.12 కోట్ల మేర పనులు పూర్తి కాగా ఇందులో రూ.4కోట్ల బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. మరో రూ.8 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ వైపు 711.313 మీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 400 మీటర్లు పూర్తి చేశారు. మిగతా పనులు కొనసాగుతున్నాయి. ఇక ఎల్‌ఐసీ వైపు 220.512 మీటర్ల మేర వంతెన నిర్మించాల్సి ఉండగా భూసేకరణ చేయాల్సి ఉండగా ఇంకా పనులు మొదలుకాలేదు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే చేసి వంతెనకు అవసరమైన భూమికి మార్కింగ్ చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నరగా భూసేకరణ ప్రక్రియ నిలిచి ఇటువైపు పనులు ప్రారంభించలేదు.



ఎల్ఐసీ కార్యాలయం వైపు ప్రారంభం కాని పనులు


రాకపోకలకు తీవ్ర అంతరాయం

పట్టణంలో రెండు రైల్వే క్రాసింగ్‌లున్నాయి. రైలు వచ్చిందంటే చాలు వాటి గేట్లు వేయడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడుతోంది. దశాబ్దాలుగా నెలకొన్న ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆర్వోబీ, పరిమిత ఎత్తులో సబ్‌వే (ఎల్‌హెచ్ఎస్)లను నిర్మించాలని సంకల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ బ్రిడ్జిలకు రూ.97.20 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. ఇందులో రాష్ట్రం వాటా రూ.57.71 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.39.49 కోట్లు. 2016–17 బడ్జెట్‌లో వీటి నిర్మాణానికి అనుమతినిచ్చిన కేంద్రం 2022లో తన వాటా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రావడంతో అదే ఏడాది అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. తొలుత కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ తర్వాత వారు ముందుకువచ్చినా పరిపాలన అనుమతుల్లో జరిగిన జాప్యంతో పనులు ఆలస్యమయ్యాయి.

ఆర్‌యూబీపై పట్టింపేది?

తాంసి బస్టాండ్ రైల్వే క్రాసింగ్ (ఎల్‌సీ గేట్ 30) వద్ద రూ.20.81 కోట్లతో చేపట్టాల్సిన పరిమిత ఎత్తులో సబ్‌వే (ఎల్‌హెచ్ఎస్) నిర్మాణం బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకునేందుకే పరిమితమైంది. వంతెనకు కేంద్రం నిధులు కేటాయించలేదు. వాహనాల రాకపోకలు వన్‌వేలో సాగేలా మార్కెట్ యార్డ్ వైపు 184.792 మీటర్లు, పంజాబ్‌చౌక్ వైపు 107.442 మీటర్లు మేర బ్రిడ్జి, మరో 1.40 మీటర్ల మేర డ్రైన్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇంకా పనులు మొదలు కాలేదు. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాగా భూసేకరణ ప్రక్రియ పూర్తికాక అక్కడి వ్యాపారులు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు భూసేకరణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో విడుదల చేయించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు విడుదలైతేనే..



రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. వంతెనలు త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో వందశాతం కేంద్రం నిధులు మంజూరు చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రయత్నిస్తున్నారు. పలుసార్లు కేంద్రానికి లేఖలు రాశారు. నిధులు విడుదలైతే పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

– ఎస్.నర్సయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని స్థానిక రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో గురువారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సంఘటన స్థలంలో ఆరుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. నిందితుల్లో నలుగురు రిటైర్డ్ ఉద్యోగులు, ఇద్దరు సాధారణ వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.9,140 నగదుతో పాటు ఆరు ఫోన్లు, కారు, ద్విచక్ర వాహనం, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విద్యానగర్‌కు చెందిన ఏ.ప్రభాకర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన జి.గంగాధర్, శాంతినగర్‌కు చెందిన రాందాస్ విల్సన్, సంజయ్‌నగర్‌కు చెందిన మైస శంకర్, భుక్తాపూర్‌కు చెందిన నిమ్మల లక్ష్మారెడ్డి, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన చిలుకని వామన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

గాంధీనగర్‌లో ఇద్దరు..

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని గాంధీనగర్‌లో పేకాట స్థావరంపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఓ ఇంట్లో రహస్యంగా పేకాడుతున్న సాగర్, నాగరాజును అరెస్టు చేయగా రవి, సంతోష్, సురేష్ పరారైనట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.9,400ల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై మజీద్‌ఖాన్, కానిస్టేబుళ్లు రాకేష్, మహేష్, కృష్ణ, చిరంజీవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన యువతి (22) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని క్రిస్టల్ గార్డెన్‌లో స్నేహితురాలి ఎంగేజ్‌మెంట్ ఉందని వెళ్లిన యువతి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గురువారం ఉదయం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి అబుబకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ముఖరాం చౌరస్తాలో బైక్ చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ముఖరాం చౌరస్తాలో గురువారం బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముఖరాం చౌరస్తాలో నివాసం ఉంటున్న భరత్ రేణ్వా ఈ నెల 11న తన ద్విచక్ర వాహనాన్ని రోజు మాదిరిగానే ఇంటిముందు నిలిపి ఉంచాడు. గురువారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు సారంగాపూర్ మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన మహేశ్ (32) తన తల్లిదండ్రులు మృతి చెందడంతో జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో ఉన్న సోదరి ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని రోజులు అక్కాబావ ఆస్తికోసం వేధిస్తున్నట్లు తన మిత్రులతో చెప్పుకునేవాడు. మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. బంధువులకు తెలపకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న బంధువులు ఆందోళనకు దిగారు. అక్కాబావల వేధింపులతోనే ఉరేసుకున్నాడని ఆరోపించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

నస్పూర్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్‌మెంట్ (టాస్క్) ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టాస్క్ ఆర్‌సీ మేనేజర్ సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల యువతకు 30 రోజుల పాటు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సి, జావా, పైథాన్, అప్టిట్యూడ్ రీజనింగ్, ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9502786488 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సర్కారు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ



నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని పెండ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2017 నుంచే ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహిస్తూ ప్రవేశాల సంఖ్య క్రమంగా పెంచుతూ వస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి తరగతుల నిర్వహణ వల్ల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాల వైపు మొగ్గు చూపకుండా తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణతో ప్రవేశాల సంఖ్య పెంచామని ప్రధానోపాధ్యాయులు ఎం.అమృతం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 130 వరకు విద్యార్థులున్నారని, ఈ సంవత్సరం సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రవేశపెట్టడం వల్ల ప్రభుత్వ బడులను బలోపేతం చేయవచ్చని స్పష్టం చేస్తున్నారు.



మంచిర్యాల జిల్లా గుడిరేవు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈవో చిన్నయ్య

- ఉమ్మడి జిల్లాలో 23 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులు
- తొలిదశలో ఉమ్మడి ఆదిలాబాద్‌లో మూడు జిల్లాల్లో అమలు
- పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు...

మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖిల్లా: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అందుబాటులోకి రానుంది. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 12 జిల్లాలు ఎంపిక చేశారు. అందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలలో పూర్వ ప్రాథమిక విద్య అమలుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు కొనసాగుతుండగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి విద్యార్థులు చదువుకునే వీలుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడుల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సర్కారు పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో కూడా ఈ ఏడాది నుంచి ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా 210 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాలలో 14, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 7, నిర్మల్ జిల్లాలో 2 పాఠశాలల్లో పూర్వ విద్య అందుబాటులోకి రానుంది.

మంచిర్యాల జిల్లాలో..

మంచిర్యాల జిల్లాలో ఎంపీపీఎస్, గుడిరేవు, ఎంపీపీఎస్, రెబ్బనపల్లి, ఎంపీపీఎస్, గంపలపల్లి, ఎంపీపీఎస్ క్లబ్‌రోడ్-లక్సెట్టిపేట్, ఎంపీపీఎస్, ముల్కలగూడ, లక్సెట్టిపేట్, ఎంపీపీఎస్ బోయవాడ, లక్సెట్టిపేట్, ఎంపీపీఎస్, నాయకపుగూడ (ఎస్), ఎంపీపీఎస్ రోట్టపల్లి, ఎంపీయూపీఎస్ పెద్దనపల్లి, ఎంపీపీఎస్ గెర్రిగూడెం (కొత్తకాలనీ), ఎంపీపీఎస్ మామడ, ఎంపీపీఎస్ మిట్‌పల్లె, మందమర్రి (వీ), ఎంపీపీఎస్ సుపాక (కే).

కుమురంభీం జిల్లాలో..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపీపీఎస్ ధనోరా (యూఎం), ఎంపీపీఎస్ గుండాయిపేట్, ఎంపీపీఎస్ ముత్తంపేట్, ఎంపీపీఎస్ డబ్బా, ఎంపీయూపీఎస్, రుద్రపూర్, ఎంపీపీఎస్ కొండపల్లి, ఎంపీపీఎస్ చడ్వాయి.

నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలో ఎంపీపీఎస్ చామన్‌పల్లి, ఎంపీపీఎస్ పేండ్‌పల్లిలో పూర్వ ప్రాథమిక విద్య అమలుకానుంది.

ప్రాథమిక పాఠశాలలు పరిపుష్టం



ప్రీ ప్రైమరీ తరగతులను అనుసంధానం చేయడం వల్ల ప్రైమరీ స్కూల్స్ బలోపేతం అవుతాయి. మూడేళ్ల వయసు ఉన్నప్పుడే ప్రైవేటు బడుల్లోకి పంపుతున్న తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ప్రైమరీ తరగతికి ప్రత్యేక సిలబస్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్

చిన్నారులకు ప్రయోజనం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ఏర్పాటుతో చిన్నారులకు ఎంతగానో ప్రయోజనం కలగనుంది. ఇదివరకు ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఉన్న ఊళ్లోనే పిల్లలను చేర్పించవచ్చు. ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అవుతాయి. పిల్లలకు విద్యాభ్యాసం ప్రారంభించేందుకు ఒక మంచి పునాది వేస్తుంది.

– ఎస్.యాదయ్య, డీఈవో, మంచిర్యాల

బస్‌పాస్‌లు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఆర్టీసీ బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవాని ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని అన్ని బస్‌పాస్ కేంద్రాల్లో స్టూడెంట్ పాస్‌లు జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, తమ విద్యాసంస్థల నుంచి ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తుపై ప్రిన్సిపాల్ సంతకం, సీల్ వేయించుకుని సమీపంలోని బస్‌పాస్ కేంద్రంలో పాస్ పొందవచ్చన్నారు. విద్యార్థులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు మాత్రమే అప్‌లోడ్ చేయాలని, సెల్ఫీ రూపంలో అప్‌లోడ్ చేయవద్దన్నారు. ఇంటర్, డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదివే విద్యార్థులు ఎస్సెస్సీ ధ్రువపత్రాన్ని విధిగా జతపరచాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అభ్యసించే విద్యార్థులు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 12 సంవత్సరాలలోపు బాలురకు 20 కిలోమీటర్ల పరిధి వరకు ఉచిత బస్‌పాస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మంత్రాల నెపంతో ఒకరి దారుణ హత్య

- నిర్మల్ జిల్లా నగర్‌లో ఘటన

లోకేశ్వరం: తమ కుటుంబ సభ్యులకు మంత్రాలు చేస్తున్నాడని ఒకరిని దారుణంగా హత్య చేసిన సంఘటన మండలంలోని నగర్‌లో చోటు చేసుకుంది. ముథోల్ సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు నగర్ గ్రామానికి చెందిన గడ్డం పోసులు (64) గురువారం ఉదయం తన వ్యవసాయ పనుల నిమిత్తం నడుచుకుంటూ వెళ్తుండగా బస్టాండ్ ప్రాంతంలో కాచుకుని కూర్చున్న అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్, గడ్డం సాయిలు ఒక్కసారిగా పోసులుపై ఇటుకలు, బండాయితో ముఖంపై దాడిచేసి హత్య చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఏడాది క్రితం గంగాధర్ 17 నెలల కూతురు, రెండు నెలల క్రితం రెండు ఆవులు మృతి చెందాయి. అంతేకాకుండా తన తల్లికూడా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, వీటన్నింటికి పోసులు చేతబడే కారణమని హత్యకు పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్

మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు గడ్డం సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఏఎస్పీ అవినాష్ కుమార్ పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.


పచ్చిరొట్టతో ప్రయోజనం

- రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- పంటల దిగుబడి పెంచుకోవాలి

చెన్నూర్‌రూరల్: అన్నదాతలు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఏడీఏ బానోతు ప్రసాద్ సూచిస్తున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూమిలో కాలుష్యం పేరుకు పోయి పంటలకు కొత్త తెగులు సోకుతాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30 కిలోల బ్యాగుకు పూర్తి ధర రూ.4,276 ఉండగా రైతుకు సబ్సిడీపై రూ.2,137కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లి పెసర, జీలుగ, అలసంద, పెసర తదితర విత్తనాలను ఎంపిక చేసుకుంటే ఖర్చు తక్కువతో పాటు ఎక్కువ దిగుబడి సాధించవచ్చని సూచిస్తున్నారు.

పచ్చిరొట్టతో లాభాలు

పచ్చిరొట్ట సాగుతో భూమిలో 16 రకాల సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువులు



ఏపుగా పెరిగిన జీలుగ (ఫైల్)

వాడితే చౌడుభూములు సారవంత మవుతాయి. మొక్కలకు బాగా ఆక్సిజన్ అందుతుంది. జింకు లోపం నివారించడంతో పాటు నత్రజని శాతం పెరుగుతుంది. మేలైన దిగుబడులు సాధించవచ్చు.

సాగు చేసే విధానం

వరి నారు పోయడానికి వారం రోజుల ముందు పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లాలి. నెల లేదా 45 రోజుల తర్వాత పచ్చిరొట్ట పైరును భూమిలో కలియ దున్నితే మురిగిపోయి ఎరువుగా మారి పంట ఎదుగుదలకు ఉపకరిస్తుంది. మెట్ట పొలాల్లో పెసర, పిల్లి పెసర, అలసంద విత్తనాలు చల్లి 45 రోజుల తర్వాత వాటి ఆకుకోసి భూమిపై పరిచి దుక్కి దున్నాలి. అలా చేస్తే అది కుళ్లి భూమిలో కలిసి పోతుంది. ఇలా చేసిన తర్వాత పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

న్యాక్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు నాబార్డు ఆధ్వర్యంలో న్యాక్ శిక్షణ కేంద్రం ద్వారా ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ల్యాండ్ సర్వేయర్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు న్యాక్ ఏడీ నాగేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ అర్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం సైతం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్, బెల్లంపల్లి కేంద్రంగా అందించే ఈ శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9866565156, 6281444199 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో ఎస్సై సుప్రియ

భైంసాటౌన్: పట్టణంలోని టిప్పుసుల్తాన్ చౌక్ వద్ద గురువారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. వాహన తనిఖీలు చేపడుతుండగా బొలెరో వాహనంలో అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీంతో అందులో 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభించడంతో సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బియ్యం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రమేశ్

సిర్పూర్(టి): మండలంలోని బెంగాళీ క్యాంపు కాలనీకి చెందిన అలోక్‌పాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదరు యువకుడు 2024 నుంచి చైల్డ్ ఫోర్నోగ్రఫీ వీడియోలను సోషల్ మీడియాలో ప్రసారం చేస్తుండడంతో అతనిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని సిర్పూర్(టి) జూనియర్ సివిల్ కోర్టులో రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్ రాకెట్ గుట్టురట్టు

- ఐదుగురిపై కేసు నమోదు.. నలుగురి అరెస్ట్
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఆన్‌లైన్ గేమింగ్ రాకెట్ గుట్టురట్టు చేసినట్లు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ పట్టణంలోని పంచవటి హోటల్‌లో కొంత మంది వ్యక్తులు ఆన్‌లైన్ గేమింగ్ ఆడి అమాయకులను మోసం చేస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. గదిలో పోలీసులు తనిఖీ చేయగా ఐదుగురు వ్యక్తులు ఉన్నారని, పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోయాడన్నారు. వారిలో నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన గొంటి రమేశ్, మహారాష్ట్రలోని ఆకోలకు చెందిన ప్రకాష్ బద్దు రాథోడ్, జిల్లా కేంద్రంలోని మీడియా కాలనీకి చెందిన జాదవ్ ప్రహ్లాద్, మహారాష్ట్రలోని థానేకు చెందిన పంకజ్ నాందేవ్, భోరజ్ మండలంలోని నిరాలకు చెందిన బోంద్రే సూర్యబాన్ ఉన్నారన్నారు. ఏ–1 గొంటి రమేశ్ ఈనెల 10న ఏ–2 ప్రకాష్ బద్దు రాథోడ్‌కు ఫోన్‌చేసి పంచవటి హోటల్‌లో గదిని బుక్ చేయాలని చెప్పాడు. పంకజ్ నాందేవ్‌తో కలిసి వస్తానని పేర్కొన్నాడు. బోంద్రే సూర్యభాన్ హోటల్‌లోని గదిలో వేచి ఉండగా వారికి ఆన్‌లైన్ గేమింగ్ గురించి గొంటి రమేశ్ వివరించాడు. ప్రతీఒక్కరు రూ.9,100 చొప్పున ఆన్‌లైన్ ద్వారా వేసి సాయంత్రం 4 గంటలకు గేమ్ ఆడటం ప్రారంభించారు. గేమ్‌లో గెలిస్తే 100 అమెరికన్ డాలర్లు లాభంగా వస్తాయని చెప్పాడు. వీరు గేమ్ ఆడుతుండగా పోలీసులకు సమాచారం రావడంతో అక్కడికి చేరుకోగా రమేశ్ పరారయ్యాడు. ఐదుగురిపై కేసు నమోదు చేసి నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఐదు సెల్ ఫోన్లు, ఒక కారు, మూడు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లెక్చరర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో అమాయకులను మోసం చేస్తున్న ప్రభుత్వ లెక్చరర్ ఇంగోలు సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం వన్‌టౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ వ్యక్తి విజయ్ ఎస్ఎఫ్‌టీ అనే వాట్సాప్ గ్రూప్ తయారు చేసి అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశాడు. పోలీసులకు సమాచారం రావడంతో పాత హౌజింగ్‌బోర్డు కాలనీలో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ ఫోన్‌కు జనవరిలో ఓ మెసేజ్ వచ్చింది. ట్రైజర్‌ఫన్ అనే సంస్థలో రూ.వెయ్యి పెట్టుబడి పెడితే ప్రతిరోజు 3 శాతం వడ్డీ ఇస్తామని, ఇతరులను చేర్పిస్తే ఒక్కో వ్యక్తికి రూ.200 చొప్పున అధికంగా ఇస్తామని పేర్కొన్నారు. దీనికి ప్రభావితమైన ఆయన వాట్సాప్ గ్రూప్ తయారు చేసి 27 మందిని అందులో చేర్చాడు. ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున సంస్థ ద్వారా కమీషన్ తీసుకొని వారిని మోసగించాడు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తీసుకెళ్తున్న ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: మత్తు పదార్థాలు తీసుకెళ్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. అతన్ని విచారించగా గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన దహి కాంబ్లే మూడు చిన్న టెర్మిన్‌డ్రగ్ బాటిళ్లను రూ.369 చొప్పున కొనుగోలు చేసి వాటిని రూ.1500 చొప్పున విక్రయించేందుకు గుడిహత్నూర్‌లోని కొల్హారి వైపు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. మెడికల్ షాపు యజమానులు మత్తు పదార్థాలపై పర్యవేక్షణ కలిగి ఉండాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా వాటిని ఎవరికీ ఇవ్వవద్దన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ వీటిని తీసుకుంటే అనారోగ్యం బారిన పడతారన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జీసీసీ ఇన్‌చార్జి డీఎం సందీప్ కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ జీసీసీ ఇన్‌చార్జి డీఎం సందీప్ కుమార్ అన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు గురువారం జీసీసీ ఉమ్మడి జిల్లా మేనేజర్లు, అకౌంటెంట్లు, గోడౌన్ క్లర్క్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్న నేపథ్యంలో పిల్లలకు అవసరమైన నిత్యావసరాలు వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న సందీప్ కుమార్

అన్ని వస్తువుల కాలపరిమితి స్వయంగా పరిశీలించిన తరువాతే సరఫరా చేయాలన్నారు. గోడౌన్‌లలో ఉన్న రికార్డులను, రిజిస్టర్లను వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. స్టాక్ వివరాలను డీఎం కార్యాలయానికి పంపించాలన్నారు. అనంతరం ఆయనను మేనేజర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

క్షుద్రపూజల కలకలం

కాసిపేట: మండల కేంద్రంలోని బన్న రాములు ఇంటి ముందు ఆకు, పసుపు, నిమ్మకాయలతో చేసిన క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి అతని ఇంటిముందు ఆకు, నిమ్మకాయలు, పసుపు, విత్తనాలను వదిలి వెళ్లారు. ఇంటి సజ్జపై సైతం వేసి ఉండటంతో గురువారం తెల్లవారు జామున వాటిని గమనించిన కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరో ఉద్దేశ పూర్వకంగానే క్షుద్రపూజలు చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.



ఇంటి ముందు పసుపు, ఆకులతో చేసిన పూజలు

తాటిచెట్లపై పిడుగులు



కాలుతున్న తాటిచెట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ధర్మారం గ్రామ శివారులో గురువారం రెండు తాటిచెట్లపై పిడుగులు పడ్డాయి. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రెండు చెట్లపై పిడుగులు పడడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

పిడుగుపడి ఆలయ గోపురం ధ్వంసం



ధ్వంసమైన రామాలయ గోపురం

తాంసి: గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి బండల్‌నాగా పూర్‌లో రామాలయం గోపురంపై పిడుగుపడింది. ఒక్కసారిగా ఆలయ గోపురంపై పిడుగుపడడంతో కలశంతో పాటు గోపురం ధ్వంసమైంది. పిడుగు పడిన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు పాటు ప్రభావంతో గ్రామంలోని పలువురి ఇళ్లలో గృహోపకరణాలు సైతం కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళను బెదిరించిన ఒకరిపై కేసు

మంచిర్యాలక్రైం: మహిళను బెదిరించిన ఒకరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన దేశవేని సునీత, జన్నారం మండలంలోని ధర్మారంకు చెందిన దుర్గం లింగేశ్వర్ మ్యారేజ్ బ్యూరో నడిపిస్తున్నారు. సదరు మహిళ లింగేశ్వర్‌కు రూ.50 వేల నగదు, 13 గ్రాముల బంగారం ఇచ్చింది. చెల్లించమనడంతో ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకొమ్మని బెదిరించాడు. సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.